క్లుప్తంగా

• కొండకు మబ్బుల గొడుగు



మరుపల్లి గ్రామంలో కొండను దట్టమైన మబ్బులు తాకుతూ గొడుగుపట్టాయా అన్నట్లు శనివారం సాయంత్రం అందమైన దృశ్యం ఆవిష్కృతమైంది. వెండి మబ్బులు కొండపైకి వాలిన సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది.

_ గజపతినగరం

ముచ్చర్లలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. 71 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి శిబిరానికి రాలేని బెడ్ రెస్ట్ రోగులు, వృద్ధులకు వైద్యసేవలందించారు.

మాజీ వీఓఏపై విచారణ



విచారణ చేపడుతున్న వెలుగు, బ్యాంకుల అధికారులు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామ మాజీ వీఓఏ చప్పా నాగమణి తాను పనిచేసిన కాలంలో తన పరిధిలోని 60 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన లావాదేవీల్లో లక్షల రూపాయలు అవకతవకలకు పాల్పడిందంటూ అధికారులకు ఫిర్యాదు అందింది. గతంలో ఇక్కడ పని చేసి గంట్యాడ మండలానికి బదిలీ అయిన వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి, మండలంలోని వివిధ బ్యాంకుల అధికారులు గ్రామంలో మాజీ వీఓఏపై శనివారం విచారణ చేపట్టారు. స్త్రీనిధి,బ్యాంకు లింకేజి రుణాల చెల్లింపులతో పాటు వివిధ రుణాలకు సంబంధించిన అన్ని బ్యాంకు లావాదేవీల రికార్డులు, రసీదులు, ఇతర వివరాలను స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి అధికారులు సేకరించారు. మాజీ వీఓఏ ఎంతమేర అవినీతికి పాల్పడ్డారన్న వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి త్వరలో వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాలల సందర్శన




పాడ: పెదకృష్ణరాజపురంలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: మండలంలోని పెదకృష్ణరాజపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జగదీశ్వరరావు, వెల్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు శనివారం సందర్శించారు. ఉపాధ్యా యుల లెసెన్ ప్లాన్, విద్యార్థుల వర్క్‌బుక్స్, హాజరు పరిశీలించారు. విద్యార్థులతో ఆంగ్ల, తెలుగు పదాలు చదివించడంతో కూడికలు, తీసివేతలు చేయించారు.చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన

జామి: మండల కేంద్రంలోని నెయ్యిలవీధి, పీతలపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ-2 గంగరాజు శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటకాలను రుచిచూశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. నెయ్యిల వీధి పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్ పరిశీలించారు.

విత్తనశుద్ధిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వేపాడ:మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో ఏఓ సి.బి.యశ్వంతరావు ఆధ్వర్యంలో రైతు సేవాకేంద్రం,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం పొలం బడి కార్యక్రమం నిర్వహించా రు. సూడోమోనస్‌తో వరి విత్తనాలను శుద్ధి చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేయడం వల్ల విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లను నివారించుకోవచ్చని వ్యవసాయ సిబ్బంది చెప్పారు. సేంద్రియ ఎరువులు,కషాయాల తయారీ విధానాన్ని వివరించారు. వీఏఏ దేముడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరావు, హరీష్, మహేష్ పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న డయేరియా

- గుర్ల మండలాన్ని చుట్టుముట్టేస్తున్న డయేరియా
- మండలంలో ఇప్పటి వరకు 11 మంది మృతి, 450 దాటిన కేసులు
- రోజు రోజుకూ పెరుగుతున్న మృతులు, రోగుల సంఖ్య
- మృతులు, రోగుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్న అధికారులు..!



గుర్ల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న రోగులు

గుర్ల: మండల ప్రజలకు డయేరియా దడ పుట్టిస్తోంది. గ్రామాల్లో పంజా విసురుతుండడంతో వామ్మో... డయేరియా అంటూ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన నాటి పరిస్థితులే మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం నెలకొన్నాయి. మండల కేంద్రంలో వ్యాధిగ్రస్తుల సంఖ్య వందల్లో ఉండడం తో ప్రజలు భయాందోళనతో ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. గ్రామస్తులు స్వచ్ఛంద కర్ఫ్యూని ప్రకటించుకున్నారు. గ్రామంలో గత నాలుగు రోజులుగా దుకాణాలు తెరుచుకోవడం లేదు. కరోనా సమయంలో కూడా లేని భయం ప్రస్తుతం గుర్ల వాసుల్లో కనిపిస్తోంది. ఈనెల 12న గుర్లలో ఎనిమిది మంది డయేరియా వ్యాధి బారిన పడ్డారు. నాటి నుంచి రోజురోజుకీ కేసుల సంఖ్య పెరుగుతునే ఉంది. ప్రస్తుతం 450 మంది వరకు వ్యాధి బారినపడినట్లు సమాచారం.13వ తేదీన మండల కేంద్రం గుర్లకు చెందిన చింతపల్లి అప్పారావు అనే వ్యక్తి డయేరియాతో మృతి చెందారని తెలుసుకున్న గుర్ల గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. ఇక ఆరోజు నుంచి 19వ తేదీ నాటికి డయేరియాతో మృతి చెందిన వారి సంఖ్య 11కు చేరింది. అయితే వైద్యాధికారులు మాత్రం ఎనిమిది మంది మాత్రమే డయేరియా వల్ల చనిపోయారని, ఇప్పటి వరకు 260 మంది వ్యాధి బారినపడి చికిత్స పొందారని చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్యశిబిరాల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలే చెబుతున్నారు కానీ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను వెల్లడించడం లేదు. నాగళ్లవలసలో బూరి సీతం నాయుడు (28) నాలుగు రోజుల కిత్రం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో, బూరి సత్యం (50) జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో డయేరియాతో చికిత్స పొందుతూ మృతి చెందారని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అధికారులు మాత్రం సీతం నాయుడు గుండె, సత్యం కిడ్నీ సంబంధిత వ్యాధులతో మృతి చెందారని అంటున్నారు.

తాగునీటి పరీక్షలు

మండలంలోని చంపావతి నది నుంచి కొండపాలెం రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న గ్రామాల్లో నీటి పరీక్షలు చేస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి శనివారం చెప్పారు. నాగళ్లవలస, గరికివలస, గూడెం, చోడవరం, కెల్ల గ్రామాల్లో కూడా నీటి పరీక్షలు చేయిస్తామన్నారు. గుర్లలో 60 ప్రభుత్వ, ప్రైవేటు తాగునీటి బోర్లలో శనివారం నీటి పరీక్షలు చేయగా 22 బోర్లలో నీరు కలుషితం అయినట్లు తేలింది.

గ్రామాలకు వ్యాపిస్తున్న వ్యాధి

గుర్ల మండల కేంద్రం నుంచి ఈ వ్యాధి పక్క గ్రామాలకు వ్యాపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం వరకు గుర్ల మండల కేంద్రంతో పా టు కోటగండ్రేడు, పెనుబర్తి, కెల్ల, గోషాడ గ్రామాల్లోనే డయేరియా కేసులు బయటపడ్డాయి. వీటిలో అధికంగా గుర్లలోనే నమోదై, మరణాలు కూడా సంభవించా యి. మండల కేంద్రాన్ని గడగడలాడించిన డయేరియా ఇప్పుడు చుట్టు పక్క గ్రామాలనూ చుట్టేస్తోంది. శనివారం తెట్టంగిలో 2, నాగళ్లవలసలో 6, గరికి వలసలో 2, పున్నపురెడ్డిపేటలో2, గూడేంలో 2, కెల్లలో 6, చోడవరంలో4, గుర్లలో4 కేసులు నమోదయ్యాయి.

వైద్యశిబిరాన్ని సందర్శించిన ఎంపీ



రోగులతో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

గుర్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో డయేరియా రోగుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శనివారం సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులకు పూర్తిగా నయమయ్యే వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలిందని చెప్పారు. ప్రస్తుతం వ్యాధి తగ్గుముఖం పడుతోందని, ప్రజలు భయాందోళన చెందొద్దని అన్నారు.

వసతిగృహాల్లో తనిఖీలు



చీపురుపల్లి: బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి ప్రేమలత



శృంగవరపుకోట: బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి వాణి

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బాలుర, బాలికల వసతిగృహాల్లో స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వసతిగృహంలో డార్మెటరీలు, కిచెన్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారా లేదా అని అడిగారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వసతిగృహ సంక్షేమాధికారులకు ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదువుకోవాలని, పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమాన్ని ఆమె సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి ఆశ్రమంలో సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.వాణి శనివారం ఎస్.కోట పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ,ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో, ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేశారు.వసతి గృహాల్లో విద్యార్థులతో మాట్లాడి వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల పరిసరాలు, వసతులు, వంటలను, బెడ్‌లు, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనం ఎదగటానికి విద్య ఒక్కటే మార్గమని, చదువుతోనే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఆమె వెంట కోర్టు సిబ్బంది, వసతి గృహాల సంక్షేమ అధికారులు ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



గజపతినగరం: గజపతినగరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమేష్ కుమార్, ఉపాధ్యాయులు



దత్తిరాజేరు: రామచంద్రాపురం హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణవేణి, పీడీ చంద్రరావు

గజపతినగరం: బొండపల్లి మండలంలోని దేవుపల్లి ఉన్నత పాఠశాలలో ఈనెల18వ తేదీన గజపతినగరం నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థిను లు ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం చిప్పాడ రమేష్‌కుమార్ శనివారం తెలిపారు. అండర్-14 విభాగం కబడ్డీ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని ఎం.ధనుశ్రీ, అండర్-17 కబడ్డీలో 9వతరగతి విద్యార్థిని బి.జాహ్నవి, అండర్-14 వాలీబాల్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని జె.అంకిత ప్రతిభ కనబరిచి నియోజకవర్గస్థాయి జట్లలో చోటు సాధించారు. వీరు ఈనెల 21న డెంకాడ మండలం రఘుమండ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో గజపతినగరం నియోజకవర్గం జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.ధారరాజు, ఉపాధ్యాయులు అభినందిచారు.

రామచంద్రాపురంహైస్కూల్ నుంచి అయిదుగురు...

దత్తిరాజేరు: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు మండలంలోని రామచంద్రాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు అయిదుగురు ఎంపికయ్యారని పీడీ చంద్రరావు శనివారం తెలిపారు. బొండపల్లి మండలంలో జరిగిన గజపతినగరం నియోజకవర్గస్థాయి పోటీల్లో అండర్-14 బాలికల విభాగం కబడ్డీలో ఎస్.మేఘన, ఎస్.గీతామాధురి, బాలురు విభాగంలో ఎస్.దివాకర్, బాలుర విభాగం అండర్-14 వాలీబాల్ పోటీల్లో బి.అజ య్, వినోద్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు జిల్లాస్థాయి పోటీల్లో నియోజకవర్గ జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రం-1లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

సాక్షి ఎఫెక్ట్

మెరకముడిదాం: మండలంలోని ఇప్పలవలసలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలపై ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణా లోపంపై శనివారం సాక్షి దినపత్రికలో 'పర్యవేక్షణ అంతంతమాత్రమే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో సూపర్‌వైజర్ లక్ష్మి గ్రామంలోని రెండు కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో దిద్దుబాట్లు ఉండడంపై అంగన్‌వాడీ కేంద్రం-1 కార్యకర్త రౌతువర్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

సాక్షి ఎఫెక్ట్



పురిటిపెంట ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తుస్తున్న ఎంపీడీఓ కల్యాణి,తదితరులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట,గజపతినగరం ఎస్‌డబ్ల్యూపీసీల(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు) ను ఎంపీడీఓ బి.కళ్యాణి పరిశీలించారు. 'నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీలు' శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. పురిటిపెంట,గజపతినగరంలో కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఓపీఆర్డీ బి.సుగుణాకరరావు, పురిటిపెంట ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు,గజపతినగరం పంచాయతీ కార్యదర్శి జనార్ధనరావు ఎంపీడీఓ వెంట ఉన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు ఛిద్రం

- సీఐ ఎన్.వి రమణమూర్తి



శృంగవరపుకోట: విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ ఎన్.వి రమణమూర్తి

శృంగవరపుకోట: డ్రగ్స్ వినియోగంతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని సీఐ ఎన్.వి రమణమూర్తి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పుణ్యగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకం వల్ల చోటుచేసుకునే పరిణామాలపై వివరించారు. వీడియోల ద్వారా ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రమాణం చేయించారు. సమావేశంలో ఎస్.కోట ఎస్సై గంగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరం..

గంట్యాడ: డ్రగ్స్‌కు (మత్తు పదార్థాలు)విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై డి. సాయికృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలపై ఆరా..



చిన్నారులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ప్రేమలత

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి శ్రీరామ్ నగర్‌లో గల ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌ను చీపురుపల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్‌జడ్జి వై.ప్రేమలత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వెల్ఫేర్ సెంటర్ హాస్టల్‌ను పరిశీలించి చిన్నారుల వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులతో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చూపు వచ్చే అవకాశం ఉన్న చిన్నారులకు కంటి పరీక్షలు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా చెవి వినికిడి సమస్య ఉన్న పిల్లలకు సంబంధిత వైద్యులచే పరీక్షలు చేయించాలన్నారు. చిన్నారులకు కృత్రిమ పరికరాలను సీఎస్సార్ ఫండ్స్ సహకారంతో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సత్ప్రవర్తన అలవరచుకోవాలి

చీపురుపల్లి: సత్ప్రవర్తన అలవరచుకుని, సమాజంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మంచి వ్యక్తులుగా ఉండాలని పోలీస్ రికార్డుల్లో చెడునడత కలిగిన వ్యక్తులుగా నమోదైన వారికి ఎస్ఐ ఎల్.దామోదరరావు సూచించారు. చీపురుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వారికి అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ రికార్డుల్లోచెడునడత కలిగిన వ్యక్తులుగా నమోదైన వారు చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. గొడవలు, వివాదాలు సృష్టించకూడదని, అలాంటి వ్యవహారాల జోలికి వెళ్లకూడదన్నారు.

రేషన్ డిపోల్లో తనిఖీలు

జామి: మండలంలోని జాగరం,గొడికొమ్ము, లొట్లపల్లి, అలమండ గ్రామాల రేషన్ డిపోల్లో సీఎస్‌డీటీ మూర్తి శనివారం తనిఖీలు నిర్వహించారు. జాగరం రేషన్ డిపోలో సరుకుల నిల్వకు సంబంధించి తేడాలు ఉన్నట్లు గుర్తించి, 6 ఏ కేసు నమోదు చేశారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులను పరిశీలించారు.

సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ



జామి: కుద్దుపాలెంలో భూమి పూజచేస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు, నాయకులు



కొత్తవలస: చీపురువలసలో భూమి పూజ చేస్తున్న కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ రామస్వామి, నాయకులు

జామి: పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామయ్యపాలెం,జి.శింగవరం,కుద్దుపాలెం,శిరికిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీడీఓ అప్పలనాయుడు ఆధ్వ ర్యంలో శనివారం భూమిపూజ చేశారు. ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శు లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని ఎం.కొత్తవలస, దేవుపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎంపీడీఓ జి.గిరిబాల, ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు శనివారం భూమి పూజ చేశారు. ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు, ఏఓ కె.తులసీరాం,ఎపిఓ బి.కృష్ణవేణి, పంచాయతీరాజ్ జేఈఈ పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

శింగరాయిలో..

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీ రాయవరపు రాజీవ్ శనివారం భూమిపూజ చేశారు. స్థానిక నాయకులు కండిపల్లి అమ్మతల్లి నాయుడు, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస పంచాయితీలో..

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి వీరభద్రపురం, చీపురువలస, మిందివలస, రాజుపాత్రునిపాలెం,వియ్యంపేట, బలిఘట్టం, ముసిరాం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సర్పంచ్ మచ్చ రామస్వామి శనివారం భూమిపూజ చేశారు. పంచాయతీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరిస్తాం

గజపతినగరం: స్థానిక పురిటిపెంటలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో మురుగుసమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ బి.కల్యాణి తెలిపారు. వసతి గృహంలో శనివారం సాయంత్రం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. డార్మెటరీ, కిచెన్‌ను పరిశీలించారు. వంటకాలను రుచి చూశారు. హాస్టల్‌లో ఎన్నాళ్లగానో డ్రైనేజ్ సమస్య ఉందని విద్యార్థినులు ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ స్పందిస్తూ మురుగు నీరు బయటకు పోయేందుకు హాస్టల్ సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు పైపులైన్ వేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పురిటిపెంటలో రక్షితమంచినీటి పథకాన్ని, శానిటేషన్ పనులను పరిశీలించారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం..



దత్తిరాజేరు: డి.వెంకటాపురం గ్రామసభలో మాట్లాడుతున్న రీసర్వే డీటీ రత్నకుమారి

గజపతినగరం: భూరీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైనా భూసమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని బొబ్బిలి ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్. రామ్మోహన్‌రావు తెలిపారు. టి.కె.సీతారామపురంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్,అడంగల్ కరక్షన్, భూహద్దులు మారినా, ఖాతా నంబర్లు, పట్టాదారుడి వివరాల్లో తప్పులు ఉంటే సరిదిద్దుతామని, రైతులు వినతిపత్రాలు అందజేయవచ్చని చెప్పారు.డీఐఓ కోల నారాయణ రావు, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఆర్ఎస్ డీటీ కె.జోగినాయుడు,సర్వేయర్ ఎం.భవాని, స్థానిక సర్పంచ్ బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

ఐ.వి.అగ్రహారంలో..

బొండపల్లి: మండలంలోని ఐ.వి.అగ్రహారంలో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులతో శనివారం గ్రామసభ నిర్వహించారు. సమగ్ర భూసర్వే జరిగిన గ్రామాలతో పాటు, జరగని గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. రైతుల నుంచి అర్జీలు స్వీక రించనున్నట్లు తెలిపారు.

నీలకంఠరాజపురంలో..

వేపాడ: నీలకంఠరాజపురంలో శనివారం నిర్వహించిన రీసర్వే భూసమస్యల పరిష్కార గ్రామసభలో రైతుల నుంచి 17 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. సర్పంచ్ గొటివాడ దేవి, ఎంపీటీసీ వేచలపు వెంకట చినరాము నాయుడు, గ్రామపెద్దలు జగ్గుబాబు, డీటీ సన్యాసి నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూర్మవరంలో..

లక్కవరపుకోట: మండలంలోని కూర్మవరం గ్రామంలో తహసీల్దార్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు.రీసర్వేలో ఏమైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దేందు కు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తప్పుల సవరణ కోసం 24మంది రైతులు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. డీటీ టి.రమేష్, సర్వేయర్ సీహెచ్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యపేటలో..

కొత్తవలస: మండలంలోని సుందరయ్యపేటలో తహసీల్దార్ నీలకంఠరావు ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ 64 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ తెలిపారు. డీటీ కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డి.వెంకటాపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని డి.వెంకటాపురంలో సమగ్ర భూసర్వే డీటీ రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. భూములకు సంబంధించి రైతులకు వన్‌బీలు రాక పోయినా, ఖాతా నంబర్లు తప్పుగా నమోదైనా, భూహద్దులు మారినా, పూర్తిస్థాయిలో భూవివరాలు రికార్డుల్లో లేకపోయినా పరిష్కరిస్తామని ఆమె చెప్పారు.

సంప్రదాయబద్ధంగా అట్లతద్ది



శంబలనగరిలో ఆశ్రమంలో గోరింటాకు పెట్టుకుంటున్న ఆడపిల్లలు



ఆటలాడుతున్న యువతులు



గౌరీపూజ చేస్తున్న యువతులు, మహిళలు

శృంగవరపుకోట: యుక్త వయసులో ఉన్న ఆడపిల్లలు వివాహం తర్వాత పాటించాల్సిన నియమ నిబంధనలు, కట్టుబాట్లు వెనుక ఉన్న శాస్త్ర సాంకేతిక విషయాలను వారికి వివరిస్తూ.. అదే సమయంలో సంప్రదాయాలను గౌరవించేలా శంబలనగరిలో శనివారం అట్లతద్ది పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము 4 గంటలకే యువతులకు 11రకాల వంటకాలు, కలగూర పులుసు, గుమ్మడి కూర, గోంగూర పచ్చడితో భోజనాలు పెట్టారు. తర్వాత రోజంతా ఉపవాసం ఉన్న యువతులకు నీరసం లేకుండా ఆర్గానిక్ బెల్లంతో కాఫీ డికాషన్, మజ్జిగ వంటివి ఇచ్చారు. అమ్మాయిలు గోరింటాకు పెట్టుకుని సాయంత్రం వరకు ఆశ్రమంలో మామిడిచెట్ల నీడలో ఊయలలు ఊగుతూ ఆటపాటలతో సందడి చేశారు. చంద్రోదయం తర్వాత యువతులు, మహిళలచే గౌరీవ్రతం నోము చేయించి అద్దంలో చంద్ర దర్శనం చేయించారు. అనంతరం వరిపిండితో వేసిన అట్లు వాయనాలు ఇప్పించి భోజనాలు చేసి వేడుకలు ముగించారు. ఈ సమయంలో ఆశ్రమ నిర్వాహకులు సనాతన సంప్రదాయాల్లో ఉన్న వైజ్ఞానిక విషయాలను వివరించారు.